

సంసారంలో సరిగమలు - తమస్విని



(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..

కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,

కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..

వెరసి సంసారంలో సరిగమలు..!)

మా నాన్న కృష్ణారావు

"నాన్నకి అసలు బాగుండలేదురా. మనిషి బొత్తిగా మంచానికి అంటుకుపోయారు."

అమ్మనించి ఆ ఉదయం నాకు ఫోన్ వచ్చింది. నేను మా అమ్మ గురించి బాధపడ్డాను. అమ్మ ఒక్కతే రోగిష్టి మనిషితో ఎన్ని బాధలు పడుతుందో అనిపించగానే, నేను తక్షణం ఆఫీస్‌కి ఫోన్ చేసి సెలవు కోరాను. అరగంటలో బట్టలు సర్దుకుని మా ఊరు వెళ్ళే ఆర్టీసీ బస్సు ఎక్కాను.

నాకు మా నాన్న గురించి ఎటువంటి బాధాలేదు. నాకాయన మీద ప్రేమ, అభిమానం, కోపంలాంటివేమీ లేవు. ఆయన నాన్న అంతే. కారణం, ఆయన ఎప్పుడూ మా జీవితంలో లేరు. అలాగని మాకు ఏ లోటు చేయలేదు. ఆయన మా ఫీజులు కట్టాడు. మమ్మల్ని చదివించాడు. మేము కోరింది తన శక్తిమేరకి నెరవేర్చాడు.

కానీ మా నాన్న మాతో మనస్ఫూర్తిగా లేడు అని ఎప్పుడూ అనిపించేది. చిన్నప్పుడు మా అమ్మని అదే అడిగేవాడిని.

"ఎందుకమ్మా మా నాన్న అందరి నాన్నల్లాగా ఉండడు?"

అమ్మ చిన్నగా నవ్వేది.

"ఏమో మనిషికి ఓ స్వభావం. మీ నాన్న స్వభావం అది."

అమ్మ ఎంత మంచిదో అనిపించింది. ఎందుకంటే మా కాలనీలోని మిగిలిన అమ్మల్లాగా మా అమ్మ ఉండదు. ఇరవై నాలుగు గంటలు ఏదో పని చేస్తుండేది. నాన్న ఏనాడూ అమ్మతో ఆప్యాయంగా మాట్లాడటం మేము వినలేదు. అలాగని కటువుగా కూడా మాట్లాడేవాడు కాదు. ఏదో విధాయకంగా మాట్లాడేవాడు. అది కూడా పొడిపొడి మాటలు.

అమ్మ, నాన్న కబుర్లు చెప్పుకోవటం నేను ఎప్పుడూ చూడలేదు. ఆ అసంతృప్తి తనని బాధించకుండా అమ్మ ఏదో ఒక వ్యాపకంలో బిజీగా ఉండేదని ఆ తర్వాత నాకు అర్థమైంది.

నాన్నకి ఎప్పుడూ ఒకే దినచర్య ఉండేది. పొద్దున్నే లేచేవాడు. న్యూస్‌పేపర్ చదువుతూ అమ్మ ఇచ్చిన కాఫీ తాగి, స్నానానికి వెళ్ళి, స్నానం అయ్యాక సూర్యుడికి ఓ నమస్కారం పెట్టేవాడు. తర్వాత లోపలికి వచ్చి అమ్మ పెట్టిన బ్రేక్‌ఫాస్ట్‌ని మౌనంగా తినేసి, అమ్మ సర్దిన చిన్న టిఫిన్ బాక్స్‌ని పట్టుకుని ఆఫీస్‌కి వెళ్ళిపోయేవాడు.

సాయంత్రం ఐదున్నర, ఆరుకల్లా ఇంటికి వచ్చేవాడు. వచ్చాక మా పెరట్లో వాలు కుర్చీలో కూర్చుని పాత హిందీ పాటలు వింటుండేవాడు. నాన్న దగ్గర చిన్న పాకెట్ రేడియో ఉండేది.

ఆ తర్వాత ఏడు, ఏడున్నరకి అమ్మ భోజనానికి పిలిస్తే వచ్చి మౌనంగా తినేసేవాడు. అటూ ఇటూ నేను, తమ్ముడు కూర్చుని అల్లరి చేస్తున్నా, కబుర్లు చెబుతున్నా మా నాన్న పట్టించుకునేవాడు కాదు. ఏదో తన లోకంలో తాను ఉన్నట్లుండేవాడు.

ఏ వంటకం, ఏ పదార్థం బాగుందనో, బాగాలేదనో మా నాన్న నోటినించి నేను ఎప్పుడూ వినలేదు. అమ్మ ఏది పెట్టినా తినేసి లేచేవాడు.

ఒక్కో సాయంత్రం అమ్మ పకోడీలులాంటివి చేసి, ఆఫీస్ నించి వచ్చాక నాన్నకి పెడితే మౌనంగా తినేసేవాడు. పెట్టకపోతే భోజనానికి పిలుపు వచ్చేదాకా 'ఆధా హై చంద్రమా' లాంటి పాటలు వింటూ ఆకాశం వంక చూస్తుండేవాడు.

మా చుట్టుపక్కల ఉన్న అందరు తండ్రులు కొడుకులతోగాని, కూతుళ్ళతోగాని సరదాగా ఉండేవాళ్ళు. వాళ్ళని చదివించేవాళ్ళు. వాళ్ళతో కలిసి కబుర్లు చెప్తూ తమ సైకిల్‌నో, స్కూటర్‌నో తుడవడం, మార్కెట్‌కి వెళ్ళేప్పుడు పిల్లల్ని వెంట తీసుకెళ్ళటంలాంటి పనులు చేసేవారు.

మాకు మా నాన్నతో ఆ చనువు ఎప్పుడూ లేదు. మా పక్కింటాయన తన పిల్లలకి తనే స్నానం చేయించి, రెడీ చేసేవాడు. ఆయన వాళ్ళ గడ్డం కింద చేయి పెట్టి తల పైకి లేపి, క్రాఫ్ దువ్వి, చక్కగా పౌడర్ రాసి వాళ్ళని స్కూల్‌కి పంపేవాడు. మేము మా నాన్ననించి ఆ విధమైన సేవలు ఆశించేవాళ్ళం. కానీ మా నాన్న తన లోకంలో తప్పించి మాతో ఉండేవాడు కాదు.

దీపావళి పండగకి నాన్నతో వెళ్ళి టపాకాయలు కొనుక్కోవాలని, ఆయనతో కలిసి లక్ష్మీ బాంబులు పేల్చాలని నాకు, తమ్ముడికి చాలా ఆశగా ఉండేది. కానీ ఆయన దీపావళి రోజు గదిలోకి వెళ్ళిపోయి, తలుపులు బిగించుకుని, రేడియో చెవిదగ్గర పెట్టుకుని పాటలు వినేవాడు తప్ప, అమ్మ పెట్టిన దీపాలని కాని, మేము పేల్చే టపాకాయలని కాని చూసి ఆనందించేవాడు కాదు.

నేను ఇంటర్మీడియెట్‌కి వచ్చాక ఒకరోజు మా అమ్మని అడిగాను.

"ఎందుకమ్మా నాన్న ఎప్పుడూ అట్లా పరధ్యానంగా ఉంటారు? మనతో ఎందుకు మాట్లాడరు?"

మా అమ్మ నవ్వింది.

"మీ నాన్నకి ఒక ప్రేమ కథ ఉందిరా. మా నాన్నేమో దాన్ని పట్టించుకోకుండా నన్నిచ్చి పెళ్ళిచేసాడు. మీ నాన్న ఆ నిరసనని ఇట్లా జీవితాంతం చూపిస్తున్నాడు అంతే."

ఆ నవ్వులో నాకు తొలిసారిగా విషాదం కనిపించింది.

అమ్మ నాన్నకి మేనమామ కూతురు. అమ్మ చెప్పిందాన్ని బట్టి, నాన్న వేరే ఎవరినో ప్రేమిస్తే, మామయ్య అమ్మనిచ్చి పెళ్ళి చేసాడు. నాన్న ఆ ప్రేమ నించి బయటికి రాలేదని నాకు ఆ లేత టీనేజ్ వయసులో అనిపించి, నాన్న మీద జాలి కలిగింది.

మాకు ఇంగ్లీష్ నాన్‌డీటైల్‌లో ఒక పాఠం ఉండేది. ఆ పాఠంలో నావలో నడిసముద్రంలోకి వెళ్ళిన సరంగు, చుక్కాని విరిగిపోతే దారి తెలియక, నడిసముద్రంలోని ఆ ఒంటరి నావలో వెల్లకిలా పడుకుని, ఆకాశంలో చుక్కలని చూస్తూ నిర్వేదంగా ఉన్నాడనే అర్థం వచ్చేలాగా ఓ కవిత ఉండేది.

అది చదివినప్పుడల్లా నాకు మా నాన్న గుర్తొచ్చేవాడు. నాన్న కూడా అలాగే చుక్కాని విరిగి, దిక్కు తోచని స్థితిలో నడిసముద్రంలో ఉన్న నావికుడిలాంటి వాడు అని నాకు అనిపించేది.

నాన్న తీరుకి నేను, తమ్ముడు అలవాటు పడిపోయాం. మా ప్రపంచం అంతా అమ్మే. మేము కబుర్లు చెప్పినా, సినిమాలకి వెళ్ళినా, పెళ్ళిళ్ళులాంటి ఫంక్షన్స్‌కి వెళ్ళినా అమ్మతోనే.

మా ఇంటికి చుట్టాలు అరుదుగా వచ్చేవాళ్ళు. అప్పుడు నాన్న ముందు గదిలోకి వచ్చి కుర్చీలో కూర్చుని, వాళ్ళు మాట్లడేది వింటూ ఉండేవాడు. ఎవరైనా ఏదైనా అడిగితే పొడిపొడిగా సమాధానం చెప్పేవాడు. వాళ్ళు అమ్మకి, నాన్నకీ కూడా చుట్టాలే కాబట్టి అమ్మ కబుర్లు చెప్పి, ఆదరించి భోజనాలు పెట్టి పంపించేది.

మా అమ్మ గుంభనంగా నాన్న గురించి బయటకి వ్యక్తం కాకుండా కాపాడుతుందని మాకనిపించేది.

మా చదువుల విషయంలో మా మార్గనిర్దేశనం మేమే చేసుకున్నాం. 'నేను ఇంజనీరింగ్ చదువుతాను' అని మా సీనియర్స్ నించి స్ఫూర్తి పొంది చెప్పాను. తమ్ముడు, 'సరే. నేను కూడా చదువుతాను' అన్నాడు.

నా చదువు పూర్తయ్యాక కేంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. తమ్ముడి చదువుకి నాన్నకి ఆర్థికంగా సహాయం చేయగలిగాను. వాడు మాస్టర్స్ కోసం విదేశాలకి వెళ్ళి, అక్కడే స్థిరపడతానని చెప్పాడు.

నాకు ఉద్యోగం వచ్చినప్పటినించి అమ్మ నాన్నతో, 'పెద్దవాడికి పెళ్ళి చేయాలి. అమ్మాయిని చూడండి' అనేది. నాన్న శుష్క మందహాసం చేసి ఊరుకునేవాడు. బహుశా ఆయన మనసులో, 'నా పెళ్ళి నా ఇష్టమొచ్చినట్లు చేసుకోలేకపోయాను. ఇంక పెద్దవాడి పెళ్ళి ఏం చేస్తాను?' అనుకుంటుండొచ్చు అనిపించేది.

ముప్పై ఏళ్ళు వచ్చినా పెళ్ళి కాలేదని అందరూ అంటారని అమ్మ భయపడేది. 'అమ్మా నాకు నచ్చిన అమ్మాయిని నేను చేసుకుంటాను. నువ్వేం బాధపడకు. నేను సన్యాసిని కాద'ని చెప్పాను. ఆ మాటతో అమ్మ ఊరడిల్లింది.

నేను ఉద్యోగరీత్యా మద్రాస్‌లో ఉంటున్నాను. అమ్మ వాళ్ళు నెల్లూరు. నేను బస్సు దిగి ఇంటికి వెళ్ళేసరికి నాన్న మంచం మీద బల్లిలా అతుక్కుపోయి ఉన్నారు. ఆయన అలా పడుకుని ఉండటం నేను ఎప్పుడూ చూడలేదు. ఎందుకో బాధేసింది. ఆయన దగ్గరికి వెళ్ళి పక్కన కూర్చుని చేతిని నా చేత్తో పట్టుకుని, 'ఎలా ఉంది నాన్నా?' అని అడిగాను.

ఆయన కళ్ళు తెరిచి నావైపు చూసాడు. కనుకొలకుల నించి స్వల్పంగా నీరు కారింది. మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. లోపలికి వెళ్ళి అమ్మని అడిగాను.

"అసలు ఏమైందమ్మా?"

"ఏమో రా! వారం క్రితం ఆఫీస్‌నించి రావడమే జ్వరంతో వచ్చారు. అప్పట్నుంచి అలా పడుకునే ఉన్నారు. నేనే ఏదో మందులు వేస్తూ ఉన్నాను."

"అదేంటమ్మా? సరైన మందులు పడకపోతే జబ్బు నయమవుతుందా? అది టైఫాయిడ్‌లాంటిదైతే కష్టం కదా? మనం డాక్టర్ దగ్గరికి తీసుకెళ్దాం." చెప్పాను.

"నేను చెప్పానురా మీ నాన్నకి. ససేమిరా వినడం లేదు. 'నేను రాను' అని గట్టిగా పట్టుబట్టారు." అమ్మ బాధగా చెప్పింది.

"వారం క్రితం ఆఫీస్ నించి వచ్చినప్పుడే ఇలా ఉన్నారా? ఏమైంది ఆఫీసులో?" అడిగాను.

"ఏమో తెలీదు. మీ నాన్న ఫ్రెండు శశిభూషణ్ వచ్చాడు. ఆ రోజు తను నాన్నని కలిసానని చెప్పాడు. 'ఏంట్రా ఇట్లా అయిపోయావు? నేను ఆ మాట చెప్పకుండా ఉండాల్సింది' అన్నాడు. మరి ఏ మాటో నాకు తెలీదు. నాన్న నాకు ఏదీ చెప్పరన్నది తెలుసుగా." అమ్మ చెప్పింది.

నాకు శశిభూషణ్ అంకుల్ తెలుసు. ఆయన మా నాన్న స్నేహితుడు. ఒకటో తరగతి నించి బి.ఎస్సీ వరకు కలిసి చదువుకున్నారు. మా నాన్నతో కాస్త ఎక్కువగా మాట్లాడే వ్యక్తి కూడా ఆయనే.

ఆ సాయంత్రం నాన్న నన్ను తన దగ్గరికి పిలిచాడు.

"పెద్దోడా. నేను ఒక కోరిక కోరితే తీరుస్తావా?" అడిగాడు.

ఆయన నాతో డైరెక్ట్‌గా మాట్లాడటం అదే మొదటిసారి. నేను తల ఊపాను. నాన్న నా చేతిని పట్టుకుని మెల్లిగా చెప్పాడు.

"గుంటూరు బ్రాడీపేట ఏదో అడ్డ లైన్లో ఇంటి నంబర్ నాకు సరిగ్గా గుర్తులేదు. శశిని అడిగితే చెప్తాడు. అక్కడ చంద్రిక అనే అమ్మాయి ఉంటుంది."

ఆయన కళ్ళు మూసుకున్నాడు. మళ్ళీ కళ్ళు తెరిచి నా వంక చూసి చెప్పాడు.

నాకు ఆవిడ ఎవరో అర్థమైంది. ఆయన 'ఆధా హై చంద్రమా' పాట ఎందుకు వినేవాడో కూడా అర్థమైంది. తల ఊపాను.

"నేను పోయాక నువ్వు ఆమెకి కిట్టు పోయాడని చెప్తావా?"

"మర్చిపోవద్దు. నువ్వు మళ్ళీ మద్రాస్ వెళ్ళేలోపు ఈ సమాచారాన్ని తప్పకుండా చంద్రికకి చెప్పాలి."

"నాన్నా, నీకేం కాదు. నువ్వు అలా మాట్లాడొద్దు." నేను నాన్నని ఊరడించాను.

ఆయన శుష్కంగా నవ్వి కళ్ళు మూసుకున్నాడు. ఆ రాత్రే మా నాన్న నిద్రలో కన్ను మూసాడు.

పది రోజులయ్యాక చంద్రిక అడ్రస్ కోసం శశిభూషణ్ అంకుల్‌ని కలిసినప్పుడు పశ్చాత్తాపంగా చెప్పాడు.

"మీ నాన్న చావుకి కారణం నేనేనేమోరా. ఆ రోజు మీ నాన్నని కలవటానికి వెళ్ళినప్పుడు, 'పెళ్ళికి గుంటూరు వెళ్ళాను. అక్కడ చంద్రిక కనిపించింద'ని చెప్పాను. చాలా ఆనందపడిపోయాడు.

'ఎక్కడ ఉంటోంది? నా గురించి అడిగిందా?' చాలా సంతోషంగా, ఆనందంగా అడిగాడు.

నేను అబద్ధం చెప్పాల్సింది. కానీ నిజమే చెప్పాను.

'లేదురా నీ గురించి అడగలేదు. మన గోపాల్‌గాడి గురించి, దద్దోజనం గురించి అడిగింది.'

'పోనీ నువ్వు చెప్పావా?' మీ నాన్న ఆశగా అడిగాడు.

'లేదు. సందర్భం రాలేదు. నేను కూడా చెప్పలేదు' అని చెప్పాను. చాలా నిరాశపడ్డాడు. 'అడగలేదా? నన్ను అడగలేదా?' అనుకుంటూ వెనక్కి తిరిగి తన సీటు దగ్గరికి వెళ్ళాడు. ఆ సాయంత్రమే వాడికి జ్వరం వచ్చింది."

నేను మాట్లాడలేదు. అది విన్నాక నాన్న మనఃస్థితి నాకు అర్థమైంది.

"వాడి లేత వయసులో ఆమెని గాఢంగా ప్రేమించాడు. తన చదువు పూర్తయ్యాక ఉద్యోగం సంపాదించుకోగానే చంద్రిక పేరెంట్స్‌ని సంప్రదించి ఆమెని పెళ్ళి చేసుకుంటానని మాకు చెప్పేవాడు. కానీ తల్లిదండ్రులు లేని కారణంగా మేనమామ పెంచాడన్న కృతజ్ఞతతో మేనమామ కూతుర్ని పెళ్ళి చేసుకోవాల్సి వచ్చింది. వాడికి అది చాలా పెద్ద షాక్. వాడి బాధ నాకు తెలుసు కనక నెల్లూరు వచ్చినప్పుడల్లా కలిసేవాడిని. ఆ తర్వాత వాడు వర్తమానంలో ఎప్పుడూ లేడు. వాడి మనసు మా ఇంటర్మీడియట్ రోజుల్లోనే ఆగిపోయింది. అప్పటి విశేషాలు, ఆ రోజుల్లో మేము చూసిన సినిమాలు, మేం చేసిన అల్లర్లు, చంద్రిక ఏ రోజు ఏ రంగు లంగా ఓణీ వేసుకుంది లాంటి మాటలు తప్పించి, నేనేం చేస్తున్నాను, నా పిల్లలేం చేస్తున్నారు, వాడి పిల్లల సంగతులేంటి ఇలాంటి వర్తమాన విషయాలు ఎప్పుడూ మాట్లాడేవాడు కాదు. వాడు అదేదో ఇంగ్లీషు కథలో చెప్పినట్లుగా ఆ కాలంలోనే స్టక్ అయిపోయాడు. అలాంటివాడికి నేను అది చెప్పకుండా వుండాల్సిందేమోరా." ఆయన పశ్చాత్తాపంగా చెప్పాడు.

నేను మద్రాస్ వెళ్ళేముంది ఆ ఆదివారం నెల్లురునించి గుంటూరు వెళ్ళాను. బ్రాడీపేటలో ఇల్లు వెతుక్కుంటూ, ఒక చిన్న డాబా ఇంటిముందుకి వెళ్ళి నిలబడ్డాను.

లోపలనించి పెద్దగా అరుపులు వినిపిస్తున్నాయి. కొద్దిసేపు ఓపిగ్గా వేచి వున్నాను. మగ కంఠం ఏదో నచ్చచెప్పే ప్రయత్నం చేస్తుంటే, ఆడ కంఠం పెద్దగా అరుస్తోంది. ఆ అరుపులు విని ఆవిడ చంద్రిక కాదుకదా అని నేను భయపడ్డాను.

ఇక ఆ సంవాదం ఆగేటట్లు లేదని కాలింగ్ బెల్ నొక్కాను. ఒక ఐదు నిమిషాలు వేచి చూసి మళ్ళీ బెల్ కొట్టాను.

తలుపు తెరుచుకుంది. మా అమ్మ వయసున్న ఒకావిడ రుసరుసలాడుతూ బయటికి వచ్చింది. ఆవిడ చక్కటి ముఖకవళికలతో, పొడవాటి జడతో ఆ వయసులో కూడా అందంగా ఉంది. కోపం ఆ అందాన్ని తగ్గిస్తోంది.

"ఏమిటి? ఏం కావాలి? ఇన్నిసార్లు బెల్ కొట్టి మనుషుల్ని ఎందుకు విసిగిస్తారు? మేము ఇప్పుడేం కొనం పోపో!" ఉగ్రంగా అరించింది.

"నేను సేల్స్‌మేన్ కాదండి. ఇక్కడ చంద్రిక అని ఎవరైనా ఉన్నారా?" నేను వినయంగా అడిగాను.

"నేనే. ఏం కావాలి?" ఆవిడ కంఠంలో సౌమ్యం లేనే లేదు.

"నేను కిట్టు వాళ్ళ అబ్బాయిని. కిట్టు తన మరణానంతరం తను పోయానని మీకు చెప్పమన్నాడు." చెప్పాను.

"కిట్టూనా? ఎవడాడు?" అసహ్యంగా చూస్తూ అడిగింది.

"ఎవరు?" లోపలనించి మగ కంఠం వినపడింది.

"ఎవడో కిట్టు పోయాడట. నాకు చెప్పమన్నాడట." ఆవిడ అరిచింది.

తర్వాత నా వైపు చూసి చెప్పింది.

"నాకే కిట్టు తెలీదు. నేను చందాలు ఇవ్వలేను. మున్సిపాలిటీ వాళ్ళకి చెపితే పట్టుకుపోతారు."

ఆ కఠినమైన మాటలకి నేను కొంచెం కంపించాను.

"లేదండి. మీతో చదువుకున్నాడు. శశిభూషణ్ తెలుసా మీకు?"

"ఓ. శశితో తిరిగే కిట్టూనా?"

"ఔను."

"ఎప్పుడూ ఇంత గుడ్లేసుకుని నా వంక చూస్తుండేవాడు. వాడు పోయాడా?"

"అవునండీ."

"పోనీ. దేశానికి ఒక భారం తగ్గింది. విసిగించి చంపేవాడు వెధవ. నాకు చెప్పావు కదా. వెళ్ళిపో."

ఆవిడ లోపలికి వెళ్ళి తలుపు గడియ వేసుకుంది.

నేను బస్‌స్టాండ్‌కి వచ్చి నెల్లూరు వెళ్ళే బస్సు ఎక్కాను. మా నాన్న చనిపోయినప్పుడు కూడా రాని దుఃఖం నాకప్పుడు వచ్చింది. ఈ చంద్రికని ప్రేమించాననే భ్రమలో మా నాన్న ఇంతకాలం జీవించాడు.

ఆయన ప్రేమకన్నా, 'ప్రేమించాను' అనే భావనని ఎక్కువగా ప్రేమించినట్లున్నాడు. తనెవరో గుర్తుంచుకోని, తన మరణానికి ఒక్క కన్నీటి బొట్టుని రాల్చని అర్హత లేని వ్యక్తిని ప్రేమించి, నన్ను, అమ్మని, తమ్ముణ్ణి, ప్రపంచాన్ని దూరం చేసుకున్నాడు. ఒక చక్కటి సంసార జీవితాన్ని, పొదరిల్లులాంటి ఇంట్లోని తన భాగస్వామ్యాన్ని విస్మరించాడు.

తనది అనుకున్న ఒక బబుల్‌లో నాన్న మూర్ఖంగా బతికాడు.

మా నాన్న కృష్ణారావుని తలుచుకుంటే నాకు దుఃఖం ఆగలేదు. నా సీట్ ముందు కడ్డీ మీద తలని వాల్చి వెక్కివెక్కి ఏడవసాగాను.

(వచ్చే సంచికలో మరో సరిగమ)

Click here to share your comments